

# మనసులోన బొమ్మ

తురగా జానకీరాణి

"బాబుగారూ, తమరు లోపలికెళ్ళి సూడొచ్చుండి, అమ్మాయిగోరడుకున్నారు. పాపాయి సుక్కలా వుందండీ," అన్నది మంత్రసాని.

"అబ్బాయీ!" అంటూ వెతుక్కుంటూ యివతలకి వచ్చిన పార్వతమ్మ కొడుకుని చూసి, "ఏరా ఇల్లా కూర్చున్నావు?" అన్నది.

ఒక్క నిముష మాగి, "పద అబ్బాయీ. పిల్లని చూద్దువుగాని. కోడలు దిక్కులు చూస్తోంది. నువ్వు కనపడలేదని" అన్నది.

అప్పటికీ శివరామయ్యలో చలనం కనబడలేదామెకు. "నే నంటూనే వున్నాను కదరా, నాలుగోది ఆడపిల్లే ఔతుంది. ఐదో కాన్పుకిగానీ పిల్లాడు పుట్టడనీ, లే మరి-" అన్నది కొడుకు మనస్సు కనిపెట్టిన ఆవిడ.

శివరామయ్య లేచి, ఉత్తరీయం దులిపి, మీద వేసుకున్నాడు. "అల్లా శాస్త్రుల్లు దగ్గరకు వెళ్ళొస్తాను" అన్నాడు.

"వెడుదువుగానిలే - తొంద రేముంది? పిల్ల చాలా కళగా వుంది. ఒక్కమాటు చూద్దువుగాని రా," అన్నది లాలింపుగా పార్వతమ్మ.

ఆయన లోపలకు అడుగు పెట్టాడు.

పురిటిగది గుమ్మంలో ఆగి, లోపలికి తొంగిచూశాడు. కిటికీలోంచి వెలుతురు గదిలోకి పడుతోంది. చిన్న మంచంలో గులాబీపువ్వే వున్నట్లుంది. కనురెప్పల వెంట్రుకలు నల్లగా, నిగనిగ లాడుతూ, తడిగా వున్నాయి. ఏ భావాలూ లేని ఆ పెదవులు ముడుచుకొని వున్నాయి. మూసివున్న గుప్పిళ్ళు తెల్లని మంచుపొర కప్పుకున్నట్లు వున్నాయి. శివరామయ్య చూపు మరల్చి భవానీవంక చూశాడు. ఆమె కళ్ళెత్తి నీరసంగా ఆయనవంక చూసింది, మళ్ళీ కళ్ళు వాల్చుకుంది. గదిలోంచి వస్తున్న సాంబ్రాణి వాసన భరింపరానిదిగా అనిపించిం దతనికి.

తొందరగా బయటకు వచ్చేశాడు. సరాసరి శాస్త్రుర్లుగా రింటికే వెళ్ళాడు.

—ఇంటికి తిరిగివచ్చేసరికి అతనిమనసు భారంగా వున్నది. తల్లి వడ్డించగా, ఐదో భోజన మయిం దనిపించాడు. "మీ మామగారికి, బావమరిదికి టెలిగ్రాములు యివ్వక పోయావూ?" అన్నది తల్లి. తలూపి వూరుకున్నా డతను.

గదిలో మంచం వాల్చుకుని, విసనకర్ర చేత్తో పుచ్చుకుని నడుం వాల్చాడు. పెద్ద పిల్ల పన్నెండేళ్ళది, వచ్చి వక్కలు, ఆకులు యిచ్చింది.

కళ్ళు మూసుకుంటే, ముడుచుకొన్న చిన్ని మూతి- మూసుకున్న నల్లని కళ్ళు, గీసినట్లున్న కనుబొమలు - చిన్న ముఖం కనుపించసాగింది, గుండెల్లో ఒక మంట

బయలుదేరింది. ఎంత సేపటికీ అది అరకపోగా, తన శరీరమంతా అలముకుని, తనని పడుకోనివ్వలేదు. లేచి కూర్చున్నాడు. వళ్ళంతా చెమట పట్టింది. నుదురు ముట్టుకుంటే చల్లగా వుంది.

పెద్ద పిల్లని కేకేసి మంచినీళ్ళు తెమ్మన్నాడు. అది త్రాగి, విసురుకుంటూ మళ్ళీ పడుకున్నాడు.

శాస్త్రుల్లు చెప్పినమాట నిజమా? అతడు అన్నమాట ఎప్పుడు అబద్ధమైంది కనుక? శివరామయ్య పడుకోలేకపోయాడు. లేచి, వంటగదివేపు వెళ్ళాడు. ఆ గది గొళ్ళెంపెట్టి వుంది. రెండోవేపున్న పురిటిగది దగ్గర మాటలు వినిపిస్తున్నాయి. పనిమనిషి, పార్వతమ్మ గుమ్మందగ్గర కూర్చుని మాట్లాడుకుంటున్నారు. "అమ్మవారిపేరు పెట్టుకోవాలి దీనికి—'' అంటోంది పార్వతమ్మ.

"పదిసార్లు అనమోకండి చిన్నమ్మగారూ, దిష్టి తగిలేను పాపాయి గోరికి" అంటోంది పనిమనిషి.

శివరామయ్య దెబ్బతిన్నవాడిలా వెనక్కి అడుగువేశాడు. "దానికి పేర్లూవద్దు, ఏమీ వద్దు. బతికి బట్ట కట్టని పిల్లనిగురించి ఎందుకీ ఆలోచనలు?" అని అరవా లనిపించింది అతనికి. శాస్త్రుల్లు చెప్పినమాట అదే—. అంతేకాదు, ఈ పిల్ల జాతకాన్ని బట్టిచూస్తే యిది పోతేనేకానీ కొడుకు పుట్టడనిపిస్తోందనికూడా చెప్పా డాయన.

"నాన్నా, నాన్నా! సుందీ పడిపోయింది...'' అంటూ ఏడుస్తూ వచ్చింది మూడో పిల్ల. శివరామయ్య చేతిలోని పుస్తకం అల్లా పారేసి వీధిలోకి పరుగెత్తాడు. సుందరి పడిపోయింది - దాని నుదురు చిల్లిపడింది. బొటబొట కారుతోంది నెత్తురు. లేచి నుంచుని నుదుటిని చేత్తో అదుముకుంటోంది యింకా.

చటుక్కున వెళ్ళి దాన్ని ఎత్తుకున్నాడు శివరామయ్య. బిత్తరపోయి తండ్రివంక చూస్తోంది అది. భవాని లోపల్నుంచి పరుగెత్తుకొచ్చింది. భర్త చేతుల్లోంచి దాన్ని అందుకుని, పరుగుపరుగున లోపలికి వెళ్ళింది. సున్నం పట్టీ వేసింది. పది నిముషాలతర్వాత అది మెల్లిగా ఏడవడం, తల్లి ఓదార్చడం విన్నాడు శివరామయ్య. మూడోపిల్ల, సుందరి కలిసి డాబామీదకి వెళ్ళారుట. మెట్లు వీధివేపునుంచి వున్నాయి. క్రింద మిఠాయిబండివా డొచ్చాడని పిలుద్దామని పరుగెత్తబోయిందట. పై మెట్టున వుండగా కాలుజారి, దబదబ దొర్లుకుంటూ క్రిందకి వచ్చిందట.

ఇదంతా విని నిట్టూర్చాడు శివరామయ్య. సుందరికి ఆరేళ్ళు వెళ్ళాయి. సుందరి బిత్తరపోయింది-కానీ బారుమని ఏడవలేదు.

ఆ పిల్ల తనది కాదనీ, ఎవరిదీకాదనీ, ఆ భగవంతుడికే కైంకర్యం చేయబడినదనీ తన మనస్సు దిటవు పరచుకున్నాడు. ఇంటికొచ్చిన బంధువు నేడో రేపో వెళ్ళిపోతాడన్న నిర్లిప్త దృష్టితో చూడడం నేర్చుకున్నాడు యీ పిల్లని. ఐనా—దాని ముఖం చూస్తే మనస్సు గుప్పిటపట్టి నొక్కినట్లవుతుంది. కళ్ళెత్తి దానివంక చూడలేక తప్పు చేసిన వాడిలా తల వంచుకునేవాడు. తనకు కొడుకు కావాలన్న కోరిక కలిగినప్పుడల్లా, సుందరి పెద్ద కళ్ళతో తనవంక దీనాతిదీనంగా చూస్తున్నట్లనిపించేది అతనికి.

భవానితో ఏమని చెప్పేది యిదంతా?

ఈ ప్రమాదం జరిగిన తరువాత తనూ, భవాని ఎక్కడకు వెళ్ళినా దాన్ని వెంటబెట్టుకునే వెళ్ళేవారు. బట్టలకొట్టు కెడుతున్నప్పుడు కూడా అదెందుకని భవాని అడ్డుపెడితే ఏమీ చెప్పలేక బిగ్గరగా అరిచి కేకలేసేవాడు. భవానికి—సుందరి అందరిలోకి చక్కని పిల్ల కాబట్టి తండ్రి అంతగా దానికోసం యిదవుతా డనిపించేది.

పార్వతమ్మ ముఖమంతా యింత నవ్వు చేసుకుంటూ వచ్చింది సావిట్లోకి. పడక్కుర్చీలో కూర్చున్న కొడుకువంక చూసి ఆనందంగా నవ్వి, "అబ్బాయీ విన్నావా?" అన్నది.

"ఏమిటీ?" అన్నాడు బిత్తరపోయి - తల్లి సంతోషం అర్థంకాని శివరామయ్య. సుందరి పుట్టాక ప్రతి చిన్నవిషయం గూఢార్థంతో కనుపించసాగింది అతనికి. అన్నిటికీ ఉలిక్కిపడుతున్నాడు.


"కోడలు యీమాటు నీకూ నాకూ బహుమానం యిస్తుందట.... కొడుకే యీమాటు" అన్నది ముసిముసి నవ్వుతో.

శివరామయ్య లేచి కూర్చున్నాడు. గొంతులో ఏదో కదిలింది. కడుపులో దేవినట్లయింది. గుటక మింగాడు. చెప్పలేని నీరసం కాళ్ళలోకి వచ్చింది. తల్లి కోసమని చిన్నగా నవ్వాడు.

"సుందరి ఏదీ?" అన్నాడు.

కొడుకులో తను ఆశించినంత సంబరం కనుపించలేదు పార్వతమ్మకు. "ఇక్కడికే నిమ్మకాయలు తెమ్మని పంపాను" అన్నది. శివరామయ్య గబగబ అంగ లేసుకుంటూ వంటింటివేపు వెళ్ళాడు. భవాని అక్కడ లేదు. పెరట్లో వున్నది.

"ప్రతి దానికీ సుందీ నెందుకు పంపి



స్తారు? లక్షసార్లు చెప్పాను వద్దని—పసి పిల్ల అనైనా లేదు" అని బిగ్గరగా కేకలేసి, చివరి వాక్యానికి కంఠం రుద్ధమైపోగా, వీధి లోకి గబగబ వచ్చేశాడు శివరామయ్య.

గేటుదగ్గర పెద్దపిల్ల నుంచునుంది—గన్నేరు కొమ్మలు వంచడానికి ప్రయత్ని స్తోంది. దానికి పెళ్ళయి రెండేళ్ళయింది. పెళ్ళిమాట లప్పుడు. వ్రతానికీ. అంతకు మునుపు ఎన్నోసార్లు శాస్త్రుల్లు యింటికి వచ్చాడు. తనకి చెప్పిన ఆ సంగతి యిం కెవరితోనూ అనవద్దని గట్టిగా చెప్పాడు శివ రామయ్య. అందుకే ఎవరికీ లేదు ఈ భయం. ఎవరి మనస్సులోనూ గుబులులేదు. ఏమీ ఎరగనట్లు పూలు కోసుకుంటున్న పెద్దాన్ని చూసి చికాకు పడ్డాడు.

"అన్నిటికీ సుందరిని పంపించమని ఎవరు చెప్పారే మీకు?" అన్నాడు. అ అమ్మాయి తెల్లబోయి చూసింది. "నేను పంపించలేదే ఎక్కడికీ! ఐనా - ఎక్కడి కెళ్ళింది అది?" అన్నది.

"ఏమో! ఎవరికి తెలుసు? ఎల్లా పోయిందో?" తండ్రి ముఖంలో గాభరా అతని కళ్ళల్లో దిగులు చూసి, నవ్వింది ఆ అమ్మాయి.

"ఏవిటి నాన్నగారూ, మరీ ఖంగారు? వస్తుందిలే. చిన్నచెల్లాయిని పంపిద్దాం చూసి రమ్మని. పాపా! ఒసేవ్ పాపా!" అని కేకేసింది.


పాప వీధిలోంచి వచ్చింది. అది ఏడు స్తోంది. "నాన్నగారూ, సుందీ .... పడి పోయింది." అంటూ ఏడుస్తూ చెప్పింది. శివరామయ్యకి ఆపుకోలేని దుఃఖం వచ్చింది.

"పడిపోయిందీ? పడిపోయిందీ? నేను అనుకుంటూనేవున్నాను. ఏదీ?...."అంటూ వెనక్కి చూడకుండా బయటకు వెళ్ళిపోయా డతను.

... మరి అరగంటకి తిరిగివచ్చాడు యిం టికి రిక్షాలో. సుందరి మోటారుసైకిలుక్రింద పడిపోయింది. పొట్టమీదనుంచి పోయింది సైకిలు. ఎల్లాబ్రతికిందో భగవంతుడి కెరుక. వంటిమీద గాయాలు తగిలాయి. ఆ రాత్రికి పెద్దపెట్టున జ్వరం వచ్చింది. పిల్ల దడుసు కున్నదని విభూతి మంత్రించి పెట్టించింది పార్వతమ్మ. భవానికి నిల్చునేందుకే ఓపిక లేదు. కడుపులో ఏదీ యిమడకుండావున్నది ఆమెకి. సుందరి మంచం ప్రక్కనే పడ క్కుర్చీ వేసుకుని. దాని వంకచూస్తూ కూర్చున్నాడు శివరామయ్య. అతను భోజనం చేయలేదు. నుదుటికి, చేతులకి, మోకాలికి కట్లతో సుందరి పడుకునుంది. దాని పెద వులు ఎండిపోయాయి. కళ్ళమీద బాధ తెలు స్తోంది. తెల్లని దాని చేతులు వదులుగా నిర్జీ వంగా పడివున్నాయి.

తనకి నిజంగానే కొడుకు కలుగుతాడా? భవాని సుందరిని కడుపుతున్నప్పుడు. ఎన్నో సార్లు కొడుకుని గురించి తలుచుకుని మురిసి పోయాడు. కానీ తనకి ఇప్పుడు ఆ ఆలోచన బాధాకరంగా వున్నది. కానీ విధి నిర్ణయం ఎల్లావున్నదో అదితను అనుభవించకతప్పదు. కళ్లు సగం మూసుకున్నాడు శివరామయ్య. నలభైఏళ్ళ జీవితంలో ఎన్నడూ లేనిది అతని కళ్ళలో నీళ్లు నిలిచాయి. క్రమ్మిన ఆ నీటి పొరల మధ్యనుంచి-సుందరి ఆకారం అలుక్కుపోయినట్లు కనుపించింది. ఎంతో ఆప్తులైనవాళ్ళు మననుంచి దూరంగా






వెళ్ళడం తప్పనిసరైతే మనస్సు విలవిల లాడినా, ఆబాధ వెనకాల వాళ్ళు వెళ్ళిపోవడ మనేది అనివార్యం అన్న గుర్తింపు ఉండనే వుంటుంది. అందువల్లనే మనస్సు దిటవు పరచుకుని, ఎడబాటు సహించ గలుగుతాం. సుందరివిషయంలో ఇటువంటినిర్ణయానికి శివ రామయ్య ఆ క్షణానే వచ్చాడు. మనస్సులో బరువుగా పేరుకుపోతున్న దుఃఖాన్ని, కడు పులో, గుండెలలో జ్వాలలాగా లేస్తున్న ఆవే దనని ఎల్లాగ తమాయించుకున్నాడో అతనికే బోధపడలేదు.

త్రెల్లగా, బొద్దుగా వున్నాడు పాపాయి. బోర్లపడడానికి ఉయ్యాల చాలక గోలపెట్టి ఏడుస్తోంటే, చూస్తూ నిలబడ్డాడు శివరా మయ్య. వాడు ఏడుస్తూనే, తండ్రివంకచూసి మరీ పెంకిగా కచ్చగా ఏడుస్తున్నాడు.

సాయంత్రం ప్రయాణం గురించి సంద డిగా తిరుగుతోంది భవాని. పెద్ద పిల్లలు యిద్దరూ మంచంమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సుందరి మంచాన్నాను కుని నిలబడి వాళ్ళ కబుర్లు వింటోంది. మూడో పిల్ల సుందరిని వెక్కిరించింది. "ఫో! మహా గొప్ప తననేగా వూరు తీసు కెడుతున్నారని-ఫో, నీ గొప్ప సర్దుకో, మాతో ఎందుకు?" అన్నది అది. సుందరి కదల్లేదు.

శివరామయ్య యీ మాటలు విని మంచం దగ్గరకు వెళ్ళాడు. పిల్లలు మాటలాపేశారు.

"ఏమిటీ అంటున్నావు?" అన్నాడు మూడో పిల్లనిచూసి. అది ఏమీ మాట్లాడ లేదు. సుందరి కూడా తలవంచుకుంది. ఏడేళ్ళ దాని పసిముఖం ఎంతో గంభీరంగా

కనుపించింది శివరామయ్యకి. దాన్ని దగ్గరకు తీసుకున్నాడు. దాని వీపుమీద నిమురుతూ. మూడోదానివేపు తిరిగి, "మరి- సుందరి అందరికంటె చిన్నదికాదూ ? అందుకని పాపం అది ఏడుస్తుంది తీసుకు వెళ్ళకపోతే. మరి మీ రిద్దరూ స్కూలు పిల్లలతో కలిసి ఢిల్లీ అవన్నీ చూసొస్తే ఏడిచిందా అది-ఏం ? మరి ఏడ్పించకూడదు చెల్లాయిని." అన్నాడు.

వాళ్ళిద్దరూ మాట్లాడలేదు. "ఏం ?" అని మళ్ళీ అడిగేసరికి తలూపి నవ్వింది మూడో పిల్ల.

సాయంత్రం రైల్లో బయలుదేరారు భార్యాభర్తలు, సుందరి, పిల్లవాడు తిరుపతికి. భవాని ఎప్పుడో పదేళ్ళక్రితం అనుకున్న మాట. కొడుకు పుడితే ఏడుకొండలవాణ్ని దర్శిస్తామని. పగలంతా భవాని, పిల్లలు సత్రంలో కూర్చునివుంటే, శివరామయ్య కాటేజి కోసమని తిరిగాడు. సాయంత్రానికి దొరికింది.

ఆ రాత్రి వరండాలో, దూరాన మినుకుమనే దీపాలు, నల్లగా, బ్రహ్మాండంగా వున్న కొండలు చూస్తూ కూర్చున్నాడు శివరామయ్య. భవాని, పిల్లలు పడుకున్నారు. దూరాన దేవాలయంలోంచి సన్నాయి వాయిద్యం వినిపిస్తోంది. చల్లగా, మెల్లగా హోరుమని లేచినగాలి కొండలనే ఊపివేస్తుందనిపిస్తోంది. ఆగాలి తనని పలుకరిస్తోంది. ఆ గాలిలోంచి ఏవో శబ్దాలు వినబడి, శివరామయ్య మనస్సుని కలవరపెట్టాయి. ప్రశాంతమైన ఆ వాతావరణం నానా బీభత్సంగా అనిపించింది అతనికి. తనలోంచి పుట్టుకొస్తున్న వెర్రి ఆవేశానికి తట్టుకోలేకపోయాడు. నీళ్ళు నిండిన కళ్ళతో, దేవాలయం గోపురం కేసి చూసి, చేతులు జోడించాడు. "స్వామీ, నా బిడ్డను కాపాడు." అని వేడుకున్నాడు మనసారా.

ఎక్కువగా జనంలేని వేపు చూసుకుని స్నానానికి వెళ్ళారు పొద్దున్న. పుష్కరిణి అంతా జనం బిలబిలలాడుతున్నారు. భవాని జుట్టు విప్పుకుంది. సుందరి జడ కూడా విప్పి, దాని గౌను ఊడదీయసాగింది. ఎండ చుర్రుమంటోంది. పిల్లవాడి ముఖానికి అడ్డంగా అంగవస్త్రం కప్పి, వాడిని ఎత్తుకున్నాడు శివరామయ్య.

భవానితోపాటు సుందరి కూడా దిగింది నీళ్ళలోకి. రెండుమెట్లుదిగి, అక్కడేనుంచుని చెంబుతో ముంచి నీళ్లు పోసుకుంటున్నారు వాళ్ళిద్దరూ.

పిల్లవాడు తండ్రిముఖంమీద చేతులతో కొట్టి, అతని జుట్టుపీకి, ఆడుతున్నాడు. తండ్రి అంగవస్త్రంతో దాగుడుమూత లాడుతున్నాడు. వాడు నవ్వినప్పుడు గులాబీ రేకుల్లా వున్న ఆ చిగుళ్ళు ఎండకి ఎర్రబడి కాశీ రత్నాల్లా వున్న వాడి చెవులుచూసి క్షణంపాటు ముగ్ధుడైనాడు శివరామయ్య.

"ఏమండీ ! ఏమండీ !...అన్న భవాని కేక వినిపించి ఉలిక్కిపడ్డాడు. జనమంతా ఖంగారు పడుతున్నారు. తను గబగబ మెట్లు దిగాడు. "ఏమైంది భవానీ ?" అన్న ప్రశ్న అతని గొంతులోనే వుండిపోతోంది.

భవాని నీళ్ళలోకి అడుగువేస్తోంది. శివరామయ్య ఆమెను చేతుకున్నాడు. "ఏమండీ-పిల్ల !" శబ్దం రావడంలేదు భవాని కంఠంలోంచి. నీళ్ళలోకి దిగిపోబోతున్న భవాని చేయి గట్టిగా పట్టుకున్నాడు శివరామయ్య.

పాపాయిని ఆమె చేతికిచ్చి చటుక్కున పుష్కరిణిలోకి దిగాడు తను. బండలు తగులుతున్నాయి కాళ్ళకి. కాళ్లు తేలిపోతున్నాయి. "సుడులుంటాయి బాబూ !" అన్నకేక ఒడ్డునుంచి వినబడింది.

అతనికాళ్ళు తేలిపోతున్నాయి - చేతికి సుందరి అందలేదు. అందడంలేదని యింకా నీరసంతో అతనిలో సత్తువ మాయమైంది. ఈదలేని అతని చేతులు సుందరికోసం నీళ్ళలో వెతుకుతున్నాయి. ●





## ముడి

అనుష్టుప్ శ్లోకంలా చదువుకోవాలి.

మొ ఖా ఖా సా కృ శ్రీ గో కృ
వ చ రా న జ శా పు అ
కు ం ఈ ద క ం ఉ గ ం జో సో
వే అ మూ మొ క షా జ పృ

క్రౌ జో శ న జ శా కు ం రా
వి అ రా బ ం క రా పు నా
ఫ భా ఖా క ం అ దే రా రా
సా పీ పం క వ మే వ న

శౌ ం వెం రా మూ కె ఏ సీ శా
వ రా స్వా తె వి వి ం ల న
ఊ ల కాం అ ల యం ం రా బ్రి
బి రా రా బా ర వా బ్రి శా.

విప్ను

[illegible]